నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

మొక్కు మాయం కర్రతే దర్శనం

నిజామాబాద్ బైపాస్ రోడ్డులో దర్శనమిస్తున్న కర్రలు

రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో 'పచ్చదనం-స్వచ్ఛదనం' కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటారు. కానీ మొక్కలను సంరక్షించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. మొక్కుబడిగా మొక్కలు నాటి మమ అనిపించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయకపోవడంతో అవి మేకలకు ఫలహారంగా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు, నిర్మలహృదయ కాన్వెంట్ ప్రాంతం తోపాటు ఖానాపూర్ వెళ్లే మార్గంలో నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇందులో కొన్నింటిని మేకలు తినేయడంతో మొక్కలకు సపోర్టుగా నాటిన కర్రలే దర్శనమిస్తుండడం గమనార్హం.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ స్కూల్‌కు వెళ్లే రోడ్డు పక్కన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్న కర్రలు

మొక్కలను తింటున్న మేకలు

సొంతగడ్డపై నెగ్గేనా!

- ఉమ్మడి జిల్లాలో సమన్వయం సాధ్యమేనా?
- తలనొప్పిగా మారనున్న డీసీసీ ఎంపిక
- కష్టతరంగా మారిన నామినేటెడ్ పోస్టుల భర్తీ
- సీనియర్, జూనియర్ల మధ్య పెరిగిన దూరం
- ఆసక్తికరంగా మారునున్న మహేశ్‌కుమార్ అడుగులు



పీసీసీ చీఫ్‌కు సవాళ్లు ఎన్నో!

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టిన మహేశ్‌కుమార్ గౌడ్ ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పదవులను అటుంచితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నాయకత్వ మార్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో వ్యవహారం ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారింది. ఉమ్మడి జిల్లాలో కీలక నేతలు ఉన్నా వారికి ప్రభుత్వంలో ఎలాంటి బాధ్యతలు లేవు. సలహాదారు పోస్టులు తప్ప, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఎవరికీ దక్కలేదు. తాజాగా పీసీసీ చీఫ్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఏఐసీసీ నాయకత్వం కట్టబెట్టింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియగానే నామినేటెడ్ పదవుల భర్తీపై ఊహాగానాలు జోరుగా సాగాయి. పార్టీని నమ్ముకుని ఆది నుంచి పనిచేస్తున్న కీలకనేతలు ఎవరికీ వారుగా పైరవీలు మొదలు పెట్టారు. కాంగ్రెస్‌లో పాత నాయకత్వంతోపాటు కొత్తగా వివిధ పార్టీల నుంచి వచ్చి చేరిన వారితో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఎవరికి పదవులు కట్టబెట్టాలో తెలియక పీసీసీ అయోమయంలో పడింది.ఇలాంటి పరిస్థితిలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నేతల మధ్య పెరిగిన అగాధాన్ని, అసంతృప్తిని కొత్త పీసీసీ చీఫ్ ఏ విధంగా అధిగమిస్తారనే దానిపై ఆసక్తి నెలకొన్నది. జిల్లాలో పార్టీని సమన్వయ పర్చడంలో మహేశ్‌కుమార్‌గౌడ్ వేయబోయే అడుగులు ఏ విధంగా ఉంటాయోనని పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధానంగా డీసీసీ అధ్యక్షుడి నియాకమంపై పీసీసీ చీఫ్‌కు తలనొప్పిగా మారనున్నది.

–నిజామాబాద్, సెప్టెంబర్ 22
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)కి త్వరలో నూతన అధ్యక్షుడిని ఎంపిక చేయనున్న నేపథ్యంలో చాలామంది సీనియర్ లీడర్లు పోటీలో ఉన్నారు.2014లో అధికారంలో కోల్పోయిన తర్వాత కూడా పార్టీని వదిలి పెట్టకుండా కొనసాగిన వారికే అధ్యక్ష పీఠం కట్టబెట్టేందుకు అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం డీసీసీ చీఫ్‌గా కొనసాగుతున్న మానాల మోహన్‌రెడ్డిని రెండు నెలల క్రితం కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఒకే వ్యక్తికి రెండు పోస్టులు ఉండకూడదనే నిబంధన మేరకు డీసీసీ అధ్యక్షుడి మార్పు అనివార్యమైంది. మరోవైపు మానాల మోహ న్ రెడ్డి కూడా డీసీసీ ప్రెసిడెంట్‌గా తప్పుకునేందుకే ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణలో భాగం గా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి డీసీసీ పోస్టును ఆశిస్తున్నవారు వరుసలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ వర్గాలను తీవ్రంగా అణచివేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీకి తప్ప మిగితా వర్గాలకు మొండిచేయి చూపించింది. నిజామాబాద్ లోక్ సభ ఎన్నికల్లోనూ అగ్రవర్ణాలకే టికెట్ కేటాయించి బీసీలను పక్కనబెట్టింది. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన వారిలో కొంత మంది కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీసీసీ చీఫ్‌గా బీసీ ఉండడంతో తమకు ఈసారి న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. ఇందులో మున్నూరు కాపు, పద్మశాలీ, యాదవ, గౌడ సామాజిక వర్గాలకు చెందిన నేతలు ముందు వరుసలో ఉన్నారు. ఈ నేపథ్యంలో డీసీసీ చీఫ్ ఎంపిక మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కత్తిమీది సాములా మారింది.

సమన్వయం సాధ్యమా!

జిల్లావాసికి పీసీసీ చీఫ్ పదవి దక్కడంపై ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఒకింత ఉత్సాహం నెలకొనగా.. అదే స్థాయిలో నివురు గప్పిన నిప్పులా నేతల మధ్య అసంతృప్తి, ఆగ్రహావేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సీనియర్లు, జూనియర్లతోపాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని సమన్వయపర్చడం సొంత జిల్లాలో పీసీసీ చీఫ్‌కు సవాలుతో కూడుకున్నది. డీసీసీ ప్రెసిడెంట్‌గా ఎవరిని నియమించినా..సొంత గడ్డపై పార్టీ పరువును నిలబెట్టడం అతి ముఖ్యమైనది.

ఆధిపత్యపోరుకు కళ్లెం వేసేనా?

ఓ వైపు సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, మదన్ మోహన్‌రావు, పీసీసీ ముఖ్య నాయకుడు షబ్బీర్ అలీ, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కాంగ్రెస్‌ను పట్టాలెక్కించడం కష్టతరంగా మారనున్నదనే చర్చ జరుగుతోంది. మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రాజకీయ అనుభవం పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన సందర్భాలు లేవు. దశాబ్దాలుగా ప్రజా జీవితంలో మమేకమైన నాయకులు ఉన్నారు. పార్టీ పరంగా నిర్ణయాధికారం పీసీసీ చీఫ్‌కు ఉండగా, ఉద్దండ నేతలంతా ఆయన మాటను జవదాటకుండా పాటిస్తారా? లేదా? అనేది రాబోవు రోజుల్లో చూడాల్సి ఉంది. ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. ఒక నాయకుడైతే రెండు నియోజకవర్గాలపై పెత్తనం చెలాయిస్తూ సాగిస్తున్న తీరుపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తిగానే ఉంది. పీసీసీ చీఫ్ వెనకాల నేనున్నానంటూ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఏం జరుగుతుందో కాలమే సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీలో రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పోస్టుల్లో కొద్ది మందికే అవకాశం కల్పించారు. చాలా మంది నేతలంతా క్యాబినెట్ ర్యాంకుతో కూడిన పదవులను, జిల్లా స్థాయిలో కీలక పోస్టులను కొల్లగొట్టేందుకు ఎవరికి వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో లోకల్ బాడీ ఎన్నికలు సైతం రానుండడంతో ద్వితీయ శ్రేణి నేతలు సైతం ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలపై కన్నేశారు. ఒకవైపు ఆశావహులను సంతృప్తి పర్చడం సవాల్‌గా మారగా..మరోవైపు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సైతం అగ్ని పరీక్షగా మారనున్నాయి.

కామారెడ్డిలో అమానవీయ ఘటన

- ప్రైవేట్ దవాఖాన పైశాచికత్వం
- ఫీజు చెల్లించలేదని వేసిన కుట్లను తొలగించిన సిబ్బంది

దవాఖాన వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

కామారెడ్డి, సెప్టెంబర్ 22 :రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడికి కుట్లు వేసినందుకు డబ్బులు చెల్లించకపోవడంతో.. అతడికి వేసిన కుట్లను ఓ ప్రైవేట్ దవాఖాన సిబ్బంది విప్పేశారు. ఈ అమానవీయ ఘటన కామారెడ్డి పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఇందుకుసంబంధించిన వివరాలు..పట్టణానికి చెందిన శ్రీను అనే యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. రక్తస్రావం కావడంతో వెంటనే స్థానిక అపెక్స్ దవాఖానకు వెళ్లాడు. డాక్టర్ (కన్సల్టేషన్)ఫీజు 300 రూపాయలు చెల్లించి చూపించుకున్నాడు. ప్రమాదంలో తగిలిన గాయాలకు దవాఖాన సిబ్బంది కుట్లు వేశారు. అయితే యువకుడి వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా ఫీజు తీసుకోవాలని చెప్పడంతో దవాఖాన సిబ్బంది నిరాకరించి ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బులు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. తన వద్ద నగదు లేదని చెప్పినప్పటికీ ఆగ్రహించిన దవాఖాన సిబ్బంది యువకుడితోపాటు వెంట ఉన్న స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. దీంతో దవాఖాన వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. చివరికి దవాఖాన సిబ్బంది యువకుడికి వేసిన కుట్లను విప్పేసి పంపించి వారిలోని పైశాచికత్వాన్ని చాటుకున్నారు. అనంతరం సదరు యువకుడిని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.

వర్షాలకు నేలకొరిగిన పంటలు

ఆందోళనలో రైతులు

బోధన్ రూరల్/ పొతంగల్, సెప్టెంబర్ 22: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. బోధన్, పొతంగల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో వరి పంటలు నేలకొరిగాయి. చేతికి వచ్చే దశలో పంటలు నేలకొరగడంతో వరి గింజలు రాలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వర్షాలు కురిస్తే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పొతంగల్ మండలం కొడిచర్ల గ్రామశివారులో నేలకొరిగిన వరి పంట

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 22: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువప్రాంతం నుంచి వరద కొనసాగుతున్నది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 7,970 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ఆదివారం 1091 అడుగుల (80.501టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 6800, లక్ష్మీకాలువకు 50, అలీసాగర్ ఎత్తిపోతలకు 180, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జిల్లా పేరును ఇందూరుగా మార్చాలి

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 22: నిజామాబాద్ జిల్లా పేరును ఇందూరుగా మార్చాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిజాం నవాబు నిరంకుశ పాలనలో వారికి అనుగుణంగా జిల్లాల పేర్లను మార్చుకున్నారని తెలిపారు. ఆదిలాబాద్‌ను ఎదులపురంగా,వరంగల్ జిల్లాను ఓరుగల్లుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దమ్ముంటే హైదరాబాద్‌కు భాగ్యనగర్ అని పేరు పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవం కాకుండా ప్రజా పాలన దినంగా నిర్వహించి ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు.. అవి 420 హామీలు అని విమర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వరి కోతలు షురూ!

ఎడపల్లితో పాటు పలు గ్రామాల్లో వానకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతోపాటు జైతాపూర్, ఠాణాకలాన్, కుర్నాపల్లి, మంగళ్ పాడ్ బాపూనగర్, ఎమ్మెస్సీఫారం గ్రామాల రైతులు వానకాలం, యాసంగిలో నెల రోజుల ముందుగానే వరి నాట్లు వేస్తారు. దీంతో వరి పంట త్వరగా చేతికి రావడంతో కోతలు ప్రారంభిస్తుంటారు. మండలంలోని ఎమ్మెస్సీ ఫారం శివారులో మదన్ అనే రైతు తన పంటను ఆదివారం హార్వేస్టర్‌తో కోయించాడు.

–ఎడపల్లి, సెప్టెంబర్ 22

కల్లు సీసాలో జలగలు

దుకాణం నిర్వాహకుడిపై గ్రామస్తుల ఆగ్రహం

కామారెడ్డి, సెప్టెంబర్ 22 : కల్లు సీసాలో జలగలు, నత్త గుల్లలు దర్శనమిచ్చాయి. దీంతో మందుబాబులు ఆగ్రహం వ్యక్తంచేసి యజమానిని నిలదీశారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఆదివారం చోటు చేసుకున్నది. అడ్లూర్‌లోని ఓ కల్లు దుకాణంలో గ్రామస్తులు కొందరు కల్లు సేవిస్తుండగా సీసాలో జలగలు, నత్త గుల్లలు కనిపించాయి.దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కల్లు దుకాణం నిర్వాహకుడిని నిలదీశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, సీసాలను శుభ్రం చేయకుండా కల్లును తయారు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆహార భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.